



# మావూళ్లో ఒక్కసారి దిగండి-

ఇట్లు
భమిడిపాటి రామగోపాలం

'విశాలా ! అర్జంటుగా అన్నం వొడ్డించూ !' అన్నాను, ఇంట్లో అడుగు పెడుతూ, చెప్పులు టేబిలు కిందికి కాళ్ళతోటే విసిరేస్తూ.

'అద్నా. ! -అద్నాఏమిటో, ఆ అర్జంటు పని! ఆఫీసరుగారు క్యాంప్ రమ్మన్నాడా ?'

'ఛీఛీ ఆఫీసరూ గాదు పాడూ గాదులేవే!- మా నర్సింగరావు లేడూ. అతనొస్తున్నాడు. యివాళ మెయిల్లో.'

'ఎవరండోయి. ఆ నర్సింగరావు ?'

'అందర్నీ ఎరిగుండే - ఎవర్నీ ఎరగనట్టు మాట్లాడతావు....నువ్వేరగనంత మాత్రంలో వాళ్లకొచ్చి నమ్యానతేం లేదులే!'

'చూసేరా ! - నే నిప్పుడేం అన్నానని?' విశాల విశాలంగా నవ్వింది. 'మీకున్న ఫ్రెండ్సు తక్కువమందా ? ఓచిన్న రిపబ్లిక్ స్టంట్ నిసీమాతియ్యొచ్చు. అందరూ వోచోట పోగైతే. — అంతమందిని ఎంతకని జ్ఞాపకం పెట్టుకోమంటారు !'

'నీకు బోధపరుస్తూ కూచోడానికి నాకు టైమ్‌లేదు. ఇవాళే ఉత్తరం ఒచ్చింది. చూసుకుని.అర్థంచేసుకుని. అన్నంవొడ్డించు. కాళ్ళూ చేతులూకడుక్కుని ఒచ్చేస్తున్నాను.' అంటూ ఉత్తరం తీసి టేబిల్‌మీద పడేసి పెరట్లోకి నడిచాను.

● ●

నరసింగరావు నా బాల్యమిత్రుడు. కాకినాడలో లాయర్‌గా ప్రాక్టీస్ చేస్తున్నాడు. ఉత్తమమైన గుణశీలాలున్నాయి: వృత్తి గౌరవంగల వ్యక్తి. పార్టీలనుంచి అనవసరంగా యెక్కువ డబ్బు తీసుకోడు. మనసారా కేసులో న్యాయం వుందని తోస్తే తప్ప కేసు నడిపించడు. మరీ వాళ్ళమంది తనకి న్యాయమే అని తోచేస్తే క్రిమినల్ కేసుల్లాంటివి ఫ్రీగా నడిపించేస్తాడు. అబద్ధపు సాక్ష్యం చెప్తే కోర్టులో శివాలెత్తిపోతాడు. తనపార్టీ అయితే కేసు మధ్యలో విడిచిపెట్టేస్తాడు. 'నాలాంటివాడు లాయర్‌గా



8

వున్నంతకాలం జయాపజయములు దైవాధీనాలే. మేజిస్ట్రేట్‌గానో జడ్జిగానో వుంటే న్యాయం కొంతైనా గెలవకపోదు.' అంటాడు.

జుడిషియల్ సెకండ్‌క్లాస్ మేజిస్ట్రేట్ పోస్టులకి ఇంటర్‌వ్యూ వుందిట. హైద్రాబాద్‌లో. కాకినాడనుంచి విజయవాడ వరకూ మెయిల్‌లో ఒచ్చి. నన్ను పలకరించి. జి.టి.లో హైద్రాబాద్ వెళతానని వ్రాశాడు. అంతకన్న ఆనందమూ అర్జంటూ నాకేం వుంటాయి.

● ● ●

జి. టి. ఎక్స్‌ప్రెస్ వెళ్ళింది. నర్సింగరావు వొచ్చి వెళ్ళాడు. కనుచూపుమేర దాటేవరకూ రైలు ఆఖరిపెట్టి చూస్తూ నించుండిపోయి. అతని మాటలే స్మరిస్తూ. అతని రూపమే దర్శిస్తూ. ఇంటి కొచ్చేస్తున్నాను.

తనకి చాలకాలంగా బెజవాడలో ప్రాక్టీస్ చెయ్యాలని వుందన్నాడు నర్సింగరావు. కాకినాడలో కంటే బెజవాడలో లైఫ్ ఏక్టివ్‌గా పుంటుందని అతని అభిప్రాయం. హైద్రాబాద్‌లో ఇంటర్‌వ్యూలో బహుశా తనకి విజయం లభించగలదన్నాడు. అలా అయితే ఈవైపు వేసే అవకాశం కోసం చూస్తానన్నాడు. కాకపోతే ప్రాక్టీస్ ఈవూళ్ళో పెట్టే ప్రయత్నం చెయ్యాలని వుందన్నాడు.

బెజవాడలో వుండగలిగినందుకు నాఅదృష్టాన్ని మెచ్చుకున్నాడు నర్సింగరావు. 'మళ్ళీ మనం చిన్ననాటిలా రోజూ సాయంత్రం వేళల్లో కలుసుకుని మనసారా మాట్లాడుకునే రోజులొస్తాయి; నువ్వుండడం బెజవాడవైపు నా ఆకర్షణని రెట్టిస్తోంది;' అన్నాడు నర్సింగరావు. నా రెండుచేతులూ నొక్కి—.

దీపో పునర్జ్వలతి!

● ● ●

డియర్ గోపాలం —


చాలా రోజులైంది; నీకు ఉత్తరం వ్రాసి. నువ్వు మంచి లెటర్ రైటర్; అయినా యెందుకో నాకు వ్రాయవు. బహుశా నేను పెద్ద పొజిషన్‌లో వున్నానని. పెద్దవాళ్ళతో మనకెందుకులే అనీ. ఊరుకున్నావేమో. అలా అయితే అది నా దురదృష్టం.

నువ్వూ మీ శ్రీమతీ చిరంజీవులూ (అయామ్ సారీ; ఎందరు ?). క్షేమంగా. ఆనందంగా. సంతోషంగా వున్నారని తలుస్తాను. మీ కందరికీ నా శుభాకాంక్షలు.

మీ బెజవాడ నగరం చూడాలనీ. మన ఆంధ్రులమధ్య ఒక్కపూట గడపాలనీ. ఎప్పటికీ నశించని కోరిక. ఈ ఐ.ఏ.ఎస్.కి కట్టి. దేశాలంట తిరుగుతూ తెలుగు మరిచిపోతానేమో అని అనుక్షణం భయం. మా వారు అప్పుడే ఈ అరవసాంబారు తాగి. అరవ మిక్స్చరు తెలుగు దంచేస్తున్నారు. ఆయన్ని వో వారంరోజులపాటు బెజవాడ. కాకినాడ. విజయనగరం చూసి రమ్మందామని వుంది; మహా అయితే వో నెలజీతం దండుగైంది గాని !

ఢిల్లీలో ఈనెల ఇరవైనాలుగో తేదీని జరగబోయే ఇంటర్ స్టేట్ ఉమెన్స్‌వెల్ఫేర్ డైరెక్టర్ల కాన్ఫరెన్సుకి నేను హాజరుకావాలి. పంధొమ్మిది నే బయలుదేరుతున్నాను. ఒకపూట మీ అందరితో బెజవాడలో స్పెండ్ చేసిగాని వెళ్ళాలని లేదు....శ్రమ అనుకోక పంధొమ్మిది రాత్రి జి.టి. కి స్టేషన్‌కి వొచ్చి నన్ను రిసీవ్ చేసుకుంటావా ?

నాకోసం అనవసరమైన ఆర్భాటం చెయ్యవొద్దని మరీ మరీ చెబుతున్నందుకు ఏమీ అనుకోకు. పి. డబ్ల్యు. రెస్టుహౌస్‌లో




ఒక వి[illegible]ంగ్ కోసం వ్రాసేను. అక్కడ వుంటాను. కల్నల్ ద్వారకనాధ్ సతీమణి దుర్గాదేవి ప్రస్తుతం వాళ్ళ నాన్నగారి ఇంట్లో (ఆయనపేరు వీరయ్యచౌదరి) ఐ కింగ్ హామ్‌పేట్లోనే ఉంటోంది. ఆవిడకి కారు కోసం వ్రాశాను. పంధొమ్మిది సాయం కాలం ఆవిడ కోసారి కనిపించు.

సముఖంలో వివరాలు.

అరుణా లక్ష్మణ్.

ఉత్తరం చూసి పొంగిపోయాను. ఆఫీసుకి అరరోజు క్యాజువల్ లీవుపెట్టి ఇంటికి వెళ్ళి విశాలకి ఉత్తరం చదివి వినిపించాను. స్టేషనుకి తనూ ఒస్తానంది విశాల. పిల్లలిద్దరూ యివాళొక్క రోజైనా తొరగా పడుకుంటే బాగుణ్ణని ఆందోళనపడింది. విశాలని ఆందోళనలో వదిలేసి కల్నల్ ద్వారకనాధ్ సతీమణి దుర్గాదేవికోసం పరుగెత్తాను.

సారీ. తొందర్లో చెప్పడం మరిచాను; అరుణా లక్ష్మణ్. ఐ. ఏ. యస్ అనే ఆవిడదీ మాదీ. మొదట్లో ఓ వూరే. మేమిద్దరం పెద్దగా స్నేహితులం కాముగానీ ఫోర్తు ఫారంనించీ స్కూల్ ఫైనల్ దాకా మావూళ్లో హైస్కూలు లేనందున రెండున్నర మైళ్ళు పొలాల గట్లంట నడచి వెళ్ళడం. రోజూనూ; కొన్ని సందర్భాల్లో తోవంతా కలిసే నడిచే వాళ్ళం. కాలేజీ చదువుకి మేం పట్నానికి మకాం ఎత్తేశాం; ఆవిడేమో వాళ్ళ పిన్నిగారింట్లో వుంది. ఇంటర్ అయినాకా, బి. ఏ. అయినాకా కొంతకాలం మేము చాలా సాధారణమైన ఉత్తరాలు వ్రాసుకున్నాం. ఆ వయస్సునిబట్టి అవి అందంగా ఉండే వేమోగాని అవి ఎంత మాత్రం స్పెషల్ లెటర్స్ కావు: ఆవిడతో జీవితాన్ని పంచుకొనే అదృష్టానికి నేనెన్నడూ ఆశించలేదు. ఒకనాడు లక్ష్మణ్ అనే వ్యక్తి

'ఆ దురదృష్టం నాదండీ' అంటూ ఎదురొచ్చాడు. (అది వేరే కథ.)

● ● ●

అరుణాలక్ష్మణ్ ఒచ్చింది; వెళ్ళింది. ఆవిడద్వారా కల్నల్ ద్వారకనాథ్: సతీమణి దుర్గాదేవితో పరిచయం కావడం ఓ విధంగా అదృష్టమే అనుకోండి; అయితే అరుణా దేవి మా యింటికి భోజనానికి రాకుండా అడ్డుపడిందని మా విశాలకి ఆవిడమీద చిరాకు కూడా ఏర్పడింది.

పెద్దపెద్ద వాళ్ళందరూ అరుణాదేవిని పి. డబ్ల్యు. బంగాళాలో చూసేరు. మద్రాస్ రాష్ట్రంలో వ్యాపారం చేస్తున్న కొందరు వర్తకులూ, స్థానిక స్త్రీ జనసంక్షేమాధి కారిణులూ, మహిళా మండలి కార్యదర్శినీ ఎట్ సెట్రాఎక్సెట్రా-అందరూఆవిడతోబాటు మాకూ - ది పూర్ కపుల్ - నమస్కారాలు చెప్పి, శుభాకాంక్షలని - కొందరు వాళ్ళ యిళ్ళకి మమ్మల్ని ఆహ్వానించడమూ జరిగితేఇదంతా ఆవిడతో మా స్నేహంద్వారా కాక మరేమిటి !

అరుణా లక్ష్మణ్ మాకు కలిగించిన ఆనందాన్నీ కాలక్షేపాన్నీ చాలా రోజులు నెమరు వేసుకొన్నాం.

● ● ●

పొద్దున్నే పళ్ళు తోముకుంటున్నాను. పరిచయం వున్న మొహం వొకటి రిక్షాలో వెళ్ళిపోతూ వుండడం పరధ్యానంగా గమనించేను. బ్రష్షును పళ్ళతో అదిమి పట్టి చేత్తో 'ఆ పావు!' అన్న సంజ్ఞచేసేను.

రిక్షా ఆగింది.

'ఇక్కడటోయ్, మీ యిల్లూ ? అప్పుడే పావుగంటైంది. ఈ రిక్షావాడు సణుగుతున్నాడు-' అంటూ దిగిన వ్యక్తి కుమారస్వామి.

'ఇదేనా రావడం ? రా. లోపలికిరా !' అన్నాను, ఆనందంగా.

'ఇదే రావడం. మెడ్రాస్ ఎక్స్ప్రెస్ లోదిగి, దిగుమర్తివారి సందుకి వెళ్ళాలంటే ఈ అబ్బాయి ముందు గాంధీనగరం తీసుకుపోయి -' అని చెప్పుకొచ్చేడు కుమారస్వామి.

కుమారస్వామి మంచి కవి. రాజమండ్రిలో ఉంటాడు. ఆర్ట్స్ కాలేజీలో హిందీమేష్టరు. అయితే కవిత్వం తెలుగులోనే రాస్తాడు. పద్యం, గేయం, వ్యాసం, కథానికా, నాటికా అన్నిట్లోనూ సిద్ధహస్తుడు. మొన్నీ మధ్య ఒక పత్రిక వాళ్ళు నిర్వహించిన నవలల పోటీలో రెండో బహుమతి పొందేడు. రెండో బహుమతి అంటే - మీకుతెలుసుగా పాఠకుల దృష్టిలో ప్రథమ బహుమతి పొందవలసిన రచన. మా మిత్రుడు కదా అనిచెప్పుకోడం కాదుగాని, ఆ మాత్రం నవల తెలుగులో దొరకదని సినీమా వాళ్ళే కాదు! రచయితలు కూడా ఒప్పుకుంటారు.

కుమారస్వామి తన నవల హక్కులు ఎవరేనా కొంటారేమోనని బెజవాడవచ్చేడు. 'పుస్తకాల ప్రచురణకి బెజవాడ కంటేమంచి కేంద్రం ఏముంది కనకా!' అన్నాడు.

చిన్నప్పటి రోజులు - అప్పుడు కాలేజీ మేగజైన్‌కి నేను కథలు వ్రాయడం - ఎడిటర్స్ అయిన శేషగిరిరావుగారికీ, విశ్వనాథ శాస్త్రిగారికి నా రచన మీద వాగ్వాదాలు రావడం, ఆఖరికి మేగజైన్‌లో నా కథ వెయ్యడం; కాలేజీ ఏనివర్సరీ రోజున మేగజైన్ ప్రశంస తెచ్చినప్పుడు కాలేజీ పోషకుల్లో వొకాయన నా కథని మెచ్చుకొని - "ప్రేయసి ప్రేమలోన కనుపించెడి తీయని స్వప్న మొక్కటే ధ్యేయము గాదు -" అన్న వాక్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ చిరంజీవి రచించిన

ఈ కథకి నేను స్పెషల్ ప్రైజు యిచ్చానన్నదం - అన్నీ జ్ఞాపకం తెచ్చుకున్నాం.

'ఇప్పటికేనా. నీ ఉత్తరాలుచూస్తే నీలో కవనశక్తి రచనాశక్తి రచనాసక్తి తగ్గలేదనే నా కనిపిస్తుంది; - వైదోంట్యూ కంటిన్యూ?' అన్నాడు కుమారస్వామి.

తను వున్న మూడురోజుల్లోనూ ఓ ఇరవైమంది రచయితలకీ ఓ పదిహేను మంది ప్రచురణకర్తలకీ నన్ను పరిచయం చేసేడు కుమారస్వామి! 'ఇతను మా మిత్రుడు ఫలానా. మంచి రచయితసుమండీ - అంటూనూ. అందరూ కుతూహలం ఆనందం వెలిబుచ్చేరేగాని సందేహించనేలేదు. ఆఖరికి మీ రచనలు యెందులో వేస్తున్నారనేనా అడగలేదు.

రోజూ ఇంట్లో రచనలమీద, సాహిత్యం మీద చర్చలు సాగేయి. మా విశాల వంట లెలావున్నాయని అడగడం మరచిపోయింది.

కుమారస్వామి వెళ్ళినాక ఓనాడు మా విశాల ఏదేదో మాట్లాడి హఠాత్తుగా సాహిత్యంలో దిగింది. గోముగా—'మీరుకూడా ఆ కుమారస్వామిగార్లా వో నవల రాయకూడదుటండీ?' అంది. 'నా మొహం; నేను నవల్రాయడ మేమిటే?' అన్నాను నేను. 'ఊరుకోండీ; మొహానికీ నవల్రాయడానికీ సంబంధమేమిటి? — నాకు తెలేదనుకున్నారా? - మీ కాలేజీ మేగజిన్‌లో మీరు రాసిన కథా, మీ పాతరచనలూ నిన్న మధ్యాన్నంతీసి చదివేను. ఇప్పుడు ఎవ్వరూ కూడా అంత యిదిగా రాయడం లేదు. మొదలు పెడుదురూ. నేనేం డిస్టర్బ్ చెయ్యనుగా. కూరా, నారా కూడా ఎవరిచేతైనా తెప్పించుకుంటాన్లెండి. — కావాలంటే ఫెయిర్ కాపీ చేసిపెడతాను, సరా! - ఎంతసేపు రాస్తారండీ, నవల. ఊరికేను! — ఆడపిల్లలు రాసేసి ప్రయిజులుకొట్టేస్తున్నారు. వేలకి వేలు రూపాయలు!' అని చిన్న బెడ్రూమ్ లెక్చరు వేసింది.

'నిజమే. రాస్తే బావుణ్ణు!'

— అనిపించింది. నాక్కూడానూ.

● ● ●

ఓనాడు సాయంత్రం నేనింటికొచ్చేసరికి ఇంట్లో కొత్తగొంతుకలు సంగతులు వినిపిస్తున్నాయి. ఏమిటా అని కాసేపు తలుపు దగ్గిర చెవి అనించి నిల్చుండిపోయాను. ఎదరింటాయన నా వాలకంచూసి నవ్వుకుంటూ వుంటే తప్పనిసరిగా తలుపు తట్టాను. సంగీతం ఆగిపోయింది; సంసారం యెదురొచ్చింది.

లోపలున్న కొత్తమనిషిని విశాల పరిచయం చేసింది: 'ఈవిడ హేమ అనీ - మావూరి మేష్టారి భార్యండీ. నేనూ యిదీ చిన్నప్పుడు వో మేష్టారు దగ్గిరే సంగీతం చెప్పించుకున్నాం.—నేను సరే, మీయింటి కోడలై మీ గూటి కూతలే సంగీతంగా జీవిస్తున్నాననుకోండి - ఇది సాధనచేసి కచేరీలు చేస్తోంది. రేపు రేడియోలో దీని ప్రోగ్రాం వుందిట - బెజవాడొచ్చింది.'

'నమస్కారమండీ. మిమ్మల్ని చూడ్డం మా అదృష్టం -' అన్నాను.

'అమ్మో - ఎంతమాట! - ఆయనలా మాట్లాడుతే నాకు సిగ్గేస్తోందే విశాలా!' అందావిడ.

నేను మళ్ళీ అన్నాను: 'అవునండీ. ఎప్పుడూ రేడియోలో గొంతుకలు వినడమే గాని అ గంధర్వ కంఠాలు గల దివ్యమూర్తుల్ని దర్శించలేదు. ఇదిగో ఈవిడ - మీ స్నేహితురాలు చెప్పిందిగా. మా గూటి కూతలే తన జీవనసంగీతం చేసుకొందిట.

కలకంఠి కాదు, కలహకంఠి !- అడగండి, ఎన్నిసార్లు నే ప్రోత్సహించేనో, సంగీతం నేర్చుకుని మధ్యలో విసర్జించి సామాన్య మానవురాలివి కాకు - అని -! మళ్ళీ నా కూత తన సంగీత మంటుంది! - నామాట మన్నించక, మళ్ళీ యీ ఎకసక్కె లెందుకు విశాలా !'

'నే నొకటి చెప్తానండీ-' అంది విశాల, చిలిపిగా నవ్వేస్తూ - 'ఈ పట్టున మీరు కలం కాయితం పుచ్చుకుంటే చక్కని కవిత్వం వ్రాస్తారు. మీ మాటలే స్వరాల్ని మించిన సంగీతంగా, ధారగావొస్తున్నాయి!'

హేమగారి కచేరికి మేం వెళ్ళేం. రికార్డింగు అయిపోయి, మళ్ళీ వినిపించినప్పుడు చెవులప్పచెప్పి విన్నాం. ఆవిడ తన కచేరీ నూ యింట్లో రేడియోలో వింది. మర్నాడు ఆవిణ్ణి యిద్దరం కలిసి రైలుకి సాగనంపేం.

'సంగీతం నేర్చుకుందికి సాధనచెయ్యక పోడం నాకుకష్టంగావుంది. మేం బెజవాడలో ఉంటేనా, ఈ రేడియోవాళ్ళని యెలాగో మంచిచేసుకుని వారానికొక ప్రోగ్రాం యివ్వక పోయేనా !' అంది హేమగారు.

'నిజమేనే. పోనీ మీ ఆయన్ని ఈవూరు ట్రాన్సఫరు చేయించుకోమను.' అంది విశాల.

'అసలు సంగతి దాటించేస్తావేం! నువ్వెందుకు సాధన చెయ్యవూ అంటా !'

'—చెప్పమంటావా ;'

'చెప్పు ! - నీకసలు కారణమంటు ఉంటేగా!'

'సంగీతంమీద గౌరవంకొద్దీ మానేశాను హేమా, రేడియో కొనుక్కున్నాక, నిజమైన సంగీతం అంటే ఏమిటో, లొల్లాయి పదం అంటే ఏమిటో, తెలిసింది. సంగీతం వొకకళైతే నేడు పాడ్డం.అనేది .వొక అపశ్రుతి. అందుకని మానేశాను హేమా !'




'ఛీ ఛీ ఛీ - నీ నోటికి హద్దులేదు. నీతో సంగీతం గురించి మాట్లాడం నాదే పొరపాటు ;- అన్నయ్యగారూ, ఈవిడకి నచ్చజెప్పే విధానం మీకు తెలిసుంటుంది. శ్రుతి మించకుండా అపశ్రుతి పడకుండా ఈవిడ తిరిగి సంగీతం పాడేటట్టు చేస్తే మీకు నా ధన్యవాదాలు........' అంది హేమగారు....

'-నీ పాటగురించీ నువ్వు స్కూల్లో ,సంగీతం బాపతు ఫస్టుప్రయిజు ప్రతీ యేడూ సంపాదించడం గురించీ నేను యీ రేడియో స్టేషన్లో అవసరం అయిన వాళ్ళందరికీ చెప్పేను - రెండునెల్లలో కనీసం లలిత సంగీతం అయినా పాడకపోతే నామీద ఒట్టేను -'

హేమగారు వెళ్ళింది. పాతబడ్డ సంగతులు మళ్ళీ స్వరాలు పోసుకున్నాయి. కూరపోపుల దగ్గిర్నుంచీ పాటల్లో కృతుల్లో వినిపించి గుబాళించేయి.

● ● ●

రోజులు గడుస్తూనే ఉన్నాయి. మేం బెజవాడలోనే ఉన్నాం. నరసింగరావులూ, అరుణా లక్ష్మణ్‌లూ, కుమార స్వాములూ,

హేమగార్లూ ఒస్తూనే వున్నారు. బెజవాడ జంక్షన్లో అన్ని ట్రెయిన్లూ ఆగుతాయి. ఇక్కట మచిలీపట్నం, గుంటకల్, కాజీపేటలకు బండి మారవలయును. మా వూళ్లో రైల్వే స్టేషనే కాదు; రేడియో స్టేషనూ, పుస్తక ప్రచురణ కర్తలూ, మూడు డెయిలీ పేపర్ ఆఫీసులూ, క్రిష్ణాబేరేజీ, కనక దుర్గ ఆలయం, రెండు సిమెంట్ ఫ్యాక్టరీలూ ఇంకా యింకా ఎన్నో నేను వ్రాయలేనన్ని ప్రజోపయోగ సంస్థలూ కళా నిలయాలూ ఉన్నాయి. మా కళ్ళకి అవి ఎప్పుడోగాని కనబడవు....మూడు కాలవల మీదా న్యూసెన్సు; పదహారుసినిమా హాళ్ళ వెనక అవినీతి; సెకండుహేండు బుక్ షాపుల్లో సాహిత్యం కింద చెలామణీ అవుతున్న అశ్లీల గ్రంథమాల, రేడియో స్టేషన్లో యెవరో తప్పులు చేసే అనౌన్సర్ అమ్మాయీ, ప్రతీ అంగుళం కమ్మర్షియలైజ్ అయిపోయిన రోడ్లమీద రోజూజరిగే లారీ ఏక్సిడెంట్లూ - యివే మా కెప్పుడు చూసినా కనిపిస్తాయి....మీలో కొందరు రోజు కొకరు చొప్పున యిక్కడికొచ్చి, ఈ బెజవాడలో ఉన్నందుకు మా అదృష్టాన్ని కొనియాడుతూ, మాచుట్టూ ఎన్నో తియ్య తియ్యటి సంగతులూ కళలూ యీ బెజవాడలోనే వున్నాయని జ్ఞాపకం చేస్తూ వుండడం మాత్రం మరిచిపోకండి.

మేం బెజవాడలోనే వుంటాం. మాయిల్లు బకింగ్‌హామ్ పేటలో దిగుమర్తివారిసందులో. ఈవూరిమీదుగా మీరు యెటువెళ్ళినా సరే యిక్కడ ఒక్కసారి తప్పకుండా దిగండి.

□□□


జ్యోతి పాఠకులకు

ఉగాది శుభాకాంక్షలు

విజయా సైంటిఫిక్

ఎక్విప్‌మెంట్సు

లేబరేటరీ ఫర్నిషర్సు

సికింద్రాబాద్ విజయవాడ తిరుపతి